క్లుప్తంగా

ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితిలో పొగాకు రైతులు



ప్రత్తిపాడు: పొగాకు రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు స్థానికంగా కనిపిస్తున్నాయని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు అన్నారు. పెదనందిపాడు, కాకుమాను మండలాల్లో మంగళవారం రైతు సంఘ నాయకులు పర్యటించారు. ఆయా గ్రామాల్లో పొగాకు రైతులను పరామర్శించారు. గిట్టుబాటు ధర లేక సాగు చేసినా అమ్ముకోలేక, పొలాల్లోనే, ఇళ్ల వద్ద ఉంచడంతో వర్షాలకు పొగాకు దెబ్బతిన్నదని.. ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు పెట్టుబడులు పెట్టామని.. మా పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని పొగాకు రైతులు నాయకులకు వివరించారు. ప్రతి ఒక్క రైతు వద్ద ఉన్న పొగాకు చివరి కేజీ వరకు కొనుగోలు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, కన్నెగంటి చంద్రరావు, నల్లమోతు రాజేంద్ర, జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా శివయ్య



చేబ్రోలు: బీజేపీ గుంటూరు జిల్లా కార్యదర్శిగా చేబ్రోలు మండలం గుండవరం గ్రామానికి చెందిన దానబోయిన శివయ్యను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మంగళవారం తెలిపారు. బీజేపీ జిల్లా వివిధ అనుబంధ విభాగాలలో పనిచేసిన శివయ్య చేబ్రోలు మండలంలో సీనియర్ నాయకుడిగా ఉన్నారు. ఈ సందర్భంగా శివయ్య మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన దానబోయిన శివయ్యను పలువురు జిల్లా నాయకులు జమ్ముల శ్యాం కిషోర్, వల్లూరు జయ ప్రకాష్ నారాయణ, పాండురంగ విఠల్, మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.శ్రీరామచంద్రమూర్తి తదితరులు అభినందించారు.

స్మార్ట్ మీటర్లను ప్రతిఘటించాలి




పెదకాకాని: కార్పొరేట్ కంపెనీ అయిన అదానీ గ్రూపునకు స్మార్ట్ మీటర్లు బిగించేటువంటి ఒప్పందాన్ని అప్పజెప్పిన ప్రభుత్వ చర్యలను ప్రతిఘటించాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. మంగళవారం పెదకాకానిలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లతో ప్రజలపై అధిక భారాలు పడి ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. ప్రజలందరూ స్మార్ట్ మీటర్లు బిగించే చర్యలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బి.బాబురావు, బురదగుంట సాంబయ్య, ఆర్.వెంకటేశ్వర్లు, ఎ.నాగేశ్వరరావు, పి.నాగమణి, వై.మల్లేశ్వరి, ఆర్.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి బకాయిలు చెల్లించాలి



ప్రత్తిపాడు: స్త్రీ నిధి రుణాలు తీసుకున్న మహిళలు తమ బకాయిలను క్రమం తప్పకుండా సకాలంలో చెల్లించాలని వెలుగు ఏపీఎం వి.లాజరు అన్నారు. ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని రత్నశ్రీ వీవో, ప్రత్తిపాడు వీవో, విజయలక్ష్మి వీవోల్లో స్త్రీనిధి రుణాలు తీసుకుని సక్రమంగా నెలవారీ వాయిదాలు సకాలంలో చెల్లించకపోవడంతో కొన్ని గ్రూపులు ఓడీ, ఎన్‌పీఏల్లోకి వెళ్లాయి. దీంతో బకాయిలను చెల్లించాలంటూ మంగళవారం లాజరు, స్త్రీనిధి మేనేజర్ ఆనంద్, సీసీలు బృందంగా ఏర్పడి బకాయిదారులైన మహిళలకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ.. రుణాలు సకాలంలో చెల్లించకపోవడంతో తిరిగి రుణాలు పొందే అవకాశం ఉండదని మహిళలకు సూచించారు.

మిర్చిలోడు వాహనం బోల్తా



ప్రత్తిపాడు: మిర్చి లోడుతో వెళుతున్న వాహనం బోల్తా కొట్టిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మంగళవారం పాతమద్రాసు రోడ్డుపై మిర్చి టిక్కీల లోడుతో వెళుతున్న ఓ వాహనం ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెం సమీపంలో గుంటూరు–పర్చూరు రోడ్డుపై అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో మిర్చి బస్తాలు రోడ్డుపక్కనున్న పంట కాలువలోనికి పడిపోయాయి. ఈ ఘటనలో అదే మార్గంలో ద్విచక్రవాహనంపై వెళుతున్న గుర్తుతెలియని ఓ వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

బాబు పాలనలో మోసం గ్యారెంటీ

- హామీలు అమలు చేయకుండా ప్రజలకు వంచన
- బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీపై ఇంటింటా ప్రచారం
- వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న అంబటి మురళీకృష్ణ, నాయకులు



చంద్రబాబు మోసాలను వివరిస్తున్న మురళీకృష్ణ

పొన్నూరు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటినా ఒక్క హామీ కూడా అమలు చేయలేకపోయారని.. అరకొరగా అమలు చేసిన తల్లికి వందనం పథకం అందరికీ వర్తించ లేదని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని మాచవరం, ములుకుదురు, పట్టణంలోని 22, 23 వార్డులలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను ఆయన వివరించారు. మురళీకృష్ణ గ్రామాల్లో పర్యటించగా ప్రజలు వివిధ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. డ్రెయిన్‌లు లేక మురుగు రోడ్లపై ప్రవహిస్తుందని మాచవరం గ్రామ ప్రజలు తెలిపారు. అయినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. బాబు మోసపూరిత ఎన్నికల మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. గ్రామంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ.. బాబు ష్యూరిటీ అని ప్రచారం చేసుకున్నారు తప్ప.. ఎవరికీ ప్రయోజనం చేకూరలేదని విమర్శించారు.

ఆర్భాటంగా ప్రచారం..

ఇది మంచి ప్రభుత్వం' అని కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటుందని అంబటి మురళీకృష్ణ విమర్శించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచాక వైఎస్సార్ సీపీ పోరాటం చేయగా 'తల్లికి వందనం' పథకం మాత్రం అమలు చేశారని.. అది కూడా అందరికీ ఇవ్వలేదని మండిపడ్డారు. దీపం పథకం సక్రమంగా అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భవనం పద్మలీల, రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యులు షేక్ సైఫుల్లా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, ఇంటిలెక్చువల్ ఫోరం అధ్యక్షులు ఎస్.రవీంద్రబాబు, గేరా సంజీవ్, కుమారి, అధికార ప్రతినిధి వెంకట సుబ్బయ్య, మండల పార్టీ అధ్యక్షులు చింతలపూడి మురళీకృష్ణ, మహిళా విభాగం అధ్యక్షురాలు కాచిపూడి మరియారాణి, మైనార్టీ అధ్యక్షులు షేక్ మౌలాలి, పిల్లి మాణిక్యరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన అధ్యక్షులు చుండూరు వీరయ్య, నాయకులు షేక్ మాము, మూర్తి రాజు, అమిరినేని సాంబశివరావు, అంబటి వెంకటేశ్వరరావు, షేక్ షర్మిల, సుషోబిత, లంక పోతు పిచ్చి రెడ్డి, అప్పిరెడ్డి, ఆదిశేషు, షేక్ లాజర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్‌కు నివాళి



పెదనందిపాడులో నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రత్తిపాడు: భారత కమ్యూనిస్టు ఉద్యమంపై చెరగని ముద్ర వేసిన వ్యక్తి కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ అని సీపీఎం నాయకులు అన్నారు. మంగళవారం పెదనందిపాడులోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో అచ్యుతానందన్‌కు నివాళులర్పించారు. స్థానిక నాయకులతో కలిసి సీనియర్ సీపీఎం సభ్యులు జంపని రామారావు అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు, మండల సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, బాపట్ల రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండి శంకరయ్య, ముద్దన వెంకటేశ్వర్లు, నల్లమోతు రాజేంద్ర, పి.భువనేశ్వరి, మర్రి లక్ష్మి, ప్రజాసంఘాల నాయకులు కన్నెగంటి చంద్రావు, పోపూరి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు అంకిత భావంతో విధులు నిర్వహించాలి



రెక్టార్ ఆచార్య కె.రత్నాషీలామణి, రిజిస్టర్ ఆచార్య జి.సింహాచలంలను సత్కరిస్తున్న వీసీ ఆచార్య కె.గంగాధర్

పెదకాకాని(ఏఎన్‌యూ): ఉద్యోగులు అంకిత భావంతో విధులు నిర్వహించి యూనివర్సిటీని ఉన్నత స్థాయికి తీసుకు వెళ్లాలని వర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధర్ కోరారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని రవీంద్రనాథ్ ఠాగూర్ పరిపాలన భవన్‌లో రెక్టార్ ఆచార్య కె.రత్నాషీలామణి, రిజిస్టర్ ఆచార్య జి.సింహాచలం అధికారం చేపట్టి ఏడాది అయిన సందర్భంగా మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. వికాస అధ్యక్షులు నీలపు ప్రసాద్, కార్యదర్శి జవాజి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధికారులను శాలువాలు, పూల బొకేలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ఆచార్య కంచర్ల గంగాధర్ మాట్లాడుతూ.. ప్రైవేటు యూనివర్సిటీలకి దీటుగా యూనివర్సిటీని ముందుకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ త్రిమూర్తిరావు, డీన్ రవికుమార్, ఉద్యోగులు ఎడ్ల రాధాకృష్ణ, లావు రాంబాబు, వికాస మాజీ సెక్రటరీ నేలపాటి నాగేశ్వరరావు, అసిస్టెంట్ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వెంకటేశ్వర్లు, వికాస నాయకులు నాగరాజు, శశి, ఆనంద్, వెంకటేష్, యేషయ్య, వెంకటేశ్వర్లు, టైం స్కేల్ ఎంప్లాయిస్ అధ్యక్షులు జేమ్స్, కార్యదర్శి బి.శ్రీనివాసరావు, దినసరి ఉద్యోగుల కార్యదర్శి నీలకంటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ బురదగుంట రత్తయ్య, నేలపాటి రమేష్‌బాబు, జాయింట్ సెక్రెటరీ శాంతిశ్రీ, వెంకటకృష్ణ, ఆయా పేషిల్లోని సిబ్బంది పాల్గొని అభినందనలు తెలియజేశారు.

ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: తమ కళాశాలలో ఇటీవల పలు కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 44 మంది విద్యార్థులకు రూ.2.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు గల ప్యాకేజీలతో కూడిన ఉద్యోగాలు లభించడం ఆనందంగా ఉందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం మాట్లాడారు. ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పనే లక్ష్యంగా తమ కళాశాలలో విద్యా బోధన ఉంటుందని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. పలు కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 44 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని అన్నారు. ఉద్యోగాలను పొందిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు, డాక్టర్ టి.శ్రీకృష్ణ, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ కె.సురేష్‌బాబు, ఎంబీఏ విభాగ ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి ఎన్.వినోద్‌కుమార్ తదితరులు అభినందించారు.

కార్మికుల సమస్యను పరిష్కరించాలి



కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వమే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత 231 రోజులుగా కార్మికులు దీక్షలు నిర్వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆశీర్వాదం, సాంబశివరావు, ఇస్మాయిల్, హగ్గయ్య, కార్మికులు నవనీతమ్మ, రమణమ్మ, శారదమ్మ, రిబ్కా, కాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: పారిశుద్ధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించి పరిష్కరించాలని వేముల దుర్గారావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం వద్ద హాజరైన కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం సమ్మె సందర్భంగా తీసుకున్న ఒప్పందాల జీవోలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, సీఐటీయూ రాజధాని డివిజన్ నాయకులు ఎం.రవి, రూరల్ నాయకులు పల్లె కృష్ణ, డేవిడ్, సంతోషం, కార్మికులు వెంగమ్మ, సతీష్, రాంబాబు, అనూష, శశికళ, శ్రీలక్ష్మి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తీర్థ మహత్యంపై ఆధ్యాత్మిక ప్రవచనం



మాట్లాడుతున్న కూర్మనాథస్వామి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణ వేదికపై మహాభారతం అరణ్యపర్వంలోని తీర్థమహత్యంపై మంగళవారం ఆధ్యాత్మిక ప్రవచనం చేపట్టారు. ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఆధ్యాత్మికవేత్త గుదిమెళ్ళ శ్రీకూర్మనాథస్వామి ప్రసంగిస్తూ అరణ్య పర్వంలో ధర్మరాజు నారదమహర్షిని తీర్థమహత్యాలను తెలుపమని అడగ్గా, పూర్వం పులస్త్యుడు భీష్ముడికి చెప్పిన తీర్థరాజ మహాత్యాలను వివరించారని అన్నారు. మహాభారతంలో తీర్థ మహత్యమనేది తీర్థ యాత్రల ప్రాముఖ్యత, మహిమను వివరిస్తుందని పేర్కొన్నారు. ఇది ఒక ఆధ్యాత్మిక ప్రయాణమని, ఇక్కడ పాండవులు తీర్థయాత్రలు చేసి పవిత్ర స్థలాలను సందర్శిస్తారని చెప్పారు. ఈ ప్రయాణంలో వారు నదులు, సరస్సులు, పుణ్యక్షేత్రాలను సందర్శించారని పేర్కొన్నారు. తీర్థయాత్రలు వారి జీవితాలపై, ఆధ్యాత్మిక ఎదుగుదలపై గొప్ప ప్రభావాన్ని చూపుతాయని అన్నారు. ఆధ్యాత్మికంగా ఎదిగేందుకు సహాయపడతాయని, పాపాలు తొలగిపోతాయని నమ్ముతారని పేర్కొన్నారు. తీర్థయాత్రలకు వెళ్లేటప్పుడు వాటి ప్రాముఖ్యత, చరిత్ర తెలుసుకోవడం ద్వారా జ్ఞానం, జ్ఞానోదయం లభిస్తుందని చెప్పారు.

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సమావేశం నేడు

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో బుధవారం మధ్యాహ్నం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రత్తిపాడు మండల పార్టీ అధ్యక్షుడు చల్లా హనుమంత్‌యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పాతమల్లాయపాలెం సెంటరులోని మండల పార్టీ కార్యాలయంలో జరగనున్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ హాజరవుతున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

కోయవారిపాలెంలో దొంగ హల్‌చల్

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెంలో ఓ దొంగ హల్ చల్ చేశాడు. సేకరించిన వివరాల ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి సమయంలో గ్రామంలోని మెయిన్ రోడ్డులో ఉన్న ఓ టెంట్ హౌస్ షట్టర్‌ను దొంగ తాళాలు పగలగొట్టేందుకు ప్రయత్నించాడు. ఒక తాళంను ఇనుప రాడ్ సాయంతో పగలగొట్టగా, షట్టర్ సెంటర్ లాక్‌తో పాటు రెండో తాళం పగలగొట్టేందుకు ప్రయత్నించినప్పటికీ సాధ్యపడలేదు. దీంతో సమీపంలో ఉన్న మరో టీ బంకుకు వెళ్లి తలుపులు పగలగొట్టేందుకు ప్రయత్నించాడు. అక్కడ కూడా వీలు పడకపోవడంతో ఏమి చేయాలో పాలుపోక పలాయనం చిత్తగించేశాడు. రెండు దుకాణాలకు ఉన్న తాళాలు పగలగొట్టి లోపలకు చొరబడేందుకు విఫల యత్నం చేసిన దృశ్యాలు సీసీ టీవీ ఫుటేజీల్లో రికార్డు అయ్యాయి. దొంగ ముఖానికి మాస్కు ధరించి దొంగతనానికి యత్నించినట్లు తెలుస్తోంది. ఎవ్వరూ గమనించకుండాఉండేందుకు దుకాణంబయట ఉన్న ట్యూబ్‌లైట్లును ఆపేసి మరీ దొంగతనానికి యత్నించాడు.

28న వ్యాసరచన, పోస్టర్ పెయింటింగ్ పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 28న ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయ పరిధిలోని డిగ్రీ కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్ పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టీజేపీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ది ఇంపార్టెన్స్ ఆఫ్ ప్రొటెక్టింగ్ నేచర్ ఫర్ ఫ్యూచర్ జనరేషన్స్ అనే అంశంపై వ్యాసరచన, ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అనే అంశంపై పోస్టర్ పెయింటింగ్ పోటీలకు ప్రతి కళాశాల నుంచి ఒక ఈవెంట్‌కు ముగ్గురు చొప్పున విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. పోస్టర్ పెయింటింగ్‌కు సంబంధించి చార్టులను కళాశాలలో అందిస్తామని, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహక బహుమతులు అందేస్తామని, పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 27వ సాయంత్రం లోపు గుంటూరు జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్ (98498 54221)ను సంప్రదించాలని సూచించారు.

వర్షపు నీటిని తొలగించాలి

లక్ష్మీపురం: నగరంలో ఇటీవల కురిసిన వర్షానికి అంతర్గత వీధుల్లో నిలిచిన వర్షపు నీటిని వెంటనే తొలగించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు లక్కా అరుణ డిమాండ్ చేశారు. పాత గుంటూరు శ్రామిక నగర్‌లో మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేషన్ అధికారులు పాత గుంటూరులోని శ్రామిక నగర్, యన్నం వారి వీధి, చెన్నం వారి వీధి, బాలాజీ నగర్, లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీటిని తొలగించేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. పాత గుంటూరులోని పలు ప్రాంతాల్లో కలుషిత నీరు సరఫరా అవుతోందని, కలుషిత తాగునీరు కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు.

ఎక్కువ ఛార్జీలు విధించారని పసుపు రైతుల ఆవేదన

దుగ్గిరాల: తమను ప్రభుత్వం ఆదుకుంటామని చెప్పి పూర్తి మొత్తంలో నష్ట పరిహారం ఇవ్వకుండా.. పాక్షికంగా నగదు విడుదల చేయడంపై పసుపు రైతులు అసంతృప్తి చెందారు. దుగ్గిరాలలో మంగళవారం బాధిత పసుపు రైతులు తమ బాధను వ్యక్త పరిచారు. బాధిత పసుపు రైతు కొమ్మారెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. అగ్ని ప్రమాద సమయంలో 344 పసుపు బస్తాలు కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ చేయగా.. ఒప్పందం ప్రకారం రావాల్సిన మొత్తం రూ.30 లక్షలు ఉండగా కేవలం రూ.10 లక్షలు మాత్రమే లెక్క చెబుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో రైతులు జాస్తి రామాంజనేయులు, కొంగర శేషుబాబు, అంకిరెడ్డి నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రహదారిపై ట్రాఫిక్ జామ్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని వైఎస్సార్ సెంటర్ నుంచి బైపాస్ రోడ్డుకు వెళ్లే మార్గంలో పశువుల హాస్పటల్ వద్ద బకింగ్‌హామ్ కెనాల్‌పై ఉన్న బ్రిడ్జిపై మంగళవారం రాత్రి ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎదురెదురుగా రెండు కార్లు వచ్చాయి. అది సింగిల్ బ్రిడ్జి కావడంతో కార్లలో ఉన్నవారు 'నువ్వు వెనక్కి వెళ్లాలంటే.. నువ్వే వెనక్కి వెళ్లాలంటూ వాదించుకున్నారు. సుమారు 15 నిమిషాల పాటు ఇద్దరూ వాదనలు పెట్టుకోవడంతో అటు బైపాస్‌రోడ్డు, ఇటు వైఎస్సార్ సెంటర్ వైపు భారీగా వాహనాలు నిలిచిపోయాయి.

స్వర్ణభారతి నగర్‌లో గంజాయి బ్యాచ్!

- 15–20 ఏళ్లలోపు యువతే లక్ష్యంగా గంజాయి అమ్మకాలు
- గంజాయి తాగి గొడవలు, చోరీలు
- అడ్డు వస్తే చంపేస్తామంటూ బెదిరింపులు



నిర్జన ప్రదేశంలో లిక్విడ్ గంజాయి ప్యాకెట్లు

గుంటూరు రూరల్: గంజాయి, లిక్విడ్ గంజాయి, మద్యం ఇతర మత్తు పదార్థాలను యువతకు అలవాటు చేస్తూ వారితో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతూ సెటిల్‌మెంట్‌లు చేస్తూ అరాచకాలు సృష్టిస్తున్నారని కాలనీలోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అందుకు నిదర్శనం గత వారం రోజుల క్రితం స్వర్ణభారతి నగర్ 40వ డివిజన్‌లో గంజాయికి అలవాటు పడ్డ ఒక బాలుడిని.. తమ తల్లిదండ్రులు పద్ధతిని మార్చే ప్రయత్నం చేయగా.. ఆ తల్లిదండ్రుల మీద బాలుడికి గంజాయి అలవాటు చేసిన బ్యాచ్ దాడిచేసి ప్రాణాలు తీసినంత పని చేశారు. బీరు సీసాలతో ఆ బాలుడి బంధువు తలపై కొట్టి తీవ్రంగా గాయపరిచారని బాధితుడి బంధువులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దాడి చేసిన గంజాయి బ్యాచ్ అంతా కేవలం 15–20 ఏళ్ల వయస్సు గల యువకులే అవ్వడం గమనార్హం.

పిల్లలు, విద్యార్థులే లక్ష్యంగా గంజాయి విక్రయాలు..

మైనర్ పిల్లలు, విద్యార్థులకు గంజాయి అమ్మి, వారిని గంజాయికి బానిసలుగా తయారు చేస్తున్నారని బాధిత మహిళలు వాపోతున్నారు. ఇటీవల కాలనీలో ఒక ఇంటిలో తమ కుమారుడు రూ.20 వేలు దొంగిలించి గంజాయి కొనుక్కుని తాగాడని బాహటంగానే ఒక తల్లి తెలుపడం బాధాకరం. ఎందుకు డబ్బులు దొంగిలించావని తమ కుమారుడిని మందలిస్తే విషయం తెలిసిన గంజాయి బ్యాచ్ తమ ఇంటిపైకి దాడిచేసి చంపేస్తామని బెదిరించారని బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని ఆ మహిళ మళ్లీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఇదే విషయంపై నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో పలు మార్లు ఫిర్యాదులు అందినా పట్టించుకోవడం లేదని సమాచారం.

ఫిర్యాదు చేసిన వారిని బెదిరిస్తున్న అధికార పార్టీ నేతలు..

గంజాయి, నిషేధిత మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడుతున్న అధికార పార్టీకి చెందిన నేత నేరుగా గంజాయి విషయమై ఫిర్యాదు చేసిన బాధితులను బెదిరించారని సమాచారం.

వర్సిటీలో శాప్ చైర్మన్‌ను అభినందించిన టీఎన్ఎస్ఎఫ్ నాయకులు



రవినాయుడును అభినందిస్తున్న నాయకులు

పెదకాకాని (ఏఎన్‌యూ): రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహిస్తుందని రాష్ట్ర శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. ఇటీవల తానా మహాసభలకు వెళ్లి మంగళవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి విచ్చేసిన రవినాయుడుకు టీఎన్ఎస్ఎఫ్ నాయకులు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు బత్తుల హేమంత్ కుమార్, యశ్వంత్, మోహన్ ,శిరీష్, అనిల్, ఉపేంద్ర, సాయి, సాయిపూర్ణ, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ఆరా



నడింపాలెంలో ప్రభుత్వ పథకాలపై ఆరా తీస్తున్న శ్రేయ ఘోష్

ప్రత్తిపాడు: మీకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా.. లేక పథకాలు పొందే సమయంలో ఏమైనా సమస్యలు ఎదుర్కొంటున్నారా.. అంటూ ఏపీ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ జాయింట్ సెక్రటరీ శ్రేయ ఘోష్ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. ప్రత్తిపాడు మండలం నడింపాలెం పంచాయతీలో మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జీవో పావర్టీ (పీ–4) గ్రామసభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రేయ ఘోష్ గ్రామ సభలో మాట్లాడుతూ.. త్వరలో ప్రభుత్వం ఫ్యామిలీ ఈపాస్ బుక్‌ను ప్రవేశ పెట్టనున్నదని తెలిపారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రభుత్వ పథకాల తీరుపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. వెంట ఎంపీడీవో కె.శివపార్వతి, డిప్యూటీ ఎంపీడీవో షేక్ ఆదం షఫీ, పంచాయతీ కార్యదర్శులు షేక్ ఖాజా, మూర్తి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

గుంటూరు రూరల్: మండలంలోని అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ కళాశాలలో మంగళవారం జూనియర్ కళాశాల విద్యార్థినులకు అంకిరెడ్డిపాలెం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌లను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు చావా సరోజిని మాట్లాడుతూ.. జీవితంలో ఎదిగేందుకు చదువు ఒక్కటే చక్కని మార్గమని తెలిపారు. ఐటీసీ స్వచ్ఛత ప్రాజెక్టు అధికారి శైలజ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మెరుగైన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కళాశాల ఇన్‌చార్జి రామచంద్రరావు మాట్లాడుతూ.. ఏటా కమిటీ సభ్యులు కాలేజీ విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించటం వల్ల కాలేజీ బలోపేతం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఐటీసీ ప్రోగ్రామ్స్ డైరెక్టర్ నారాయణ, రిటైర్డ్ అధ్యాపకుడు దేవగిరి వీరగంగాధరరెడ్డి, విశ్రాంత వ్యాయామ అధ్యాపకుడు మున్నంగి సంజీవరెడ్డి, కమిటీ సభ్యుడు కుర్రా పుల్లారెడ్డి, ఉపాధ్యాయులు శాంతిప్రియ, హనుమంతరావు, శివపార్వతి, షకీలా, అరుణ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేపు అమరావతిలో జాబ్ మేళా

తాడికొండ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి.. శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏపీ సీఆర్డీయే సౌజన్యంతో గురువారం ఉదయం 10 గంటల నుంచి తుళ్లూరులోని సీఆర్డీయే స్కిల్ హబ్ కేంద్రంలో జాబ్ మేళా నిర్వహించనున్నారని ఏపీ సీఆర్డీయే కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ మేళా ద్వారా ఫ్రెషర్స్‌తో పాటు వృత్తి అనుభవం ఉన్నవారితో 5 కంపెనీలలో పలు టెక్నికల్ ఉద్యోగాలను భర్తీ చేయనున్నారని తెలిపింది. జాబ్ మేళాలో పలు కంపెనీలు పాల్గొననున్నాయని.. ఇంటర్వ్యూలలో ఎంపికైన అభ్యర్థులు అమరావతి, విజయవాడతో పాటు ఎంపిక చేసిన ప్రాంతాలలో పని చేయాల్సి ఉంటుందని.. పూర్తి వివరాలకు శంకర్ 98484 24207.. శ్రీకర్ 99634 25999 నంబర్లను సంప్రదించవచ్చని ఆ ప్రకటనలో తెలిపారు.